# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 18-05-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **కోకో గింజలు కిలో 500 రూపాయల చొప్పున కొనుగోలు చేయడానికి మాండలీజ్ సంస్థ అంగీకరించిందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.**
2. **ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి ఆర్టీసీ సిద్ధంగా ఉందని సంస్థ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు వెల్లడించారు.**
3. **ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఈ రోజు తిరంగా ర్యాలీలు నిర్వహించారు.**
4. **ప్రపంచ పురావస్తు ప్రదర్శనశాలల దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం.**

==========================

కోకో గింజలు కిలో 500 రూపాయల చొప్పున కొనుగోలు చేయడానికి మాండలీజ్ సంస్థ అంగీకరించిందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. గిట్టుబాటు ధర కోసం నిడదవోలులో రైతులు చేస్తున్న ఆందోళనపై తన క్యాంపు కార్యాలయంలో నిన్న ఆయన అధికారులు, ట్రేడర్లు, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సాగు చేసిన చివరి గింజ వరకు కొనుగోలు చేస్తారని హామీ ఇచ్చారు. మంత్రి హామీతో రైతులు ఆందోళన విరమించారు. కాగా.. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి రైతుల నుంచి కోకో గింజలు కొనుగోలు చేస్తామని అధికారులు వెల్లడించారు.

-------------------------

తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని కేంద్ర పునరుత్పాదక విద్యుత్ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి దర్శించుకున్నారు. ఈ ఉదయం విఐపీ విరామ సమయంలో కుటుంబ సభ్యులతో కలసి స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శన అనంతరం రంగనాయకుల మండలంలో వేదపండితులు ఆయనకు వేద ఆశీర్వచనం అందించారు. ఆలయం వెలుపల ప్రహ్లాద్ జోషి మాట్లాడుతూ.. దేశానికి, మన సైన్యానికి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి మరింత ధైర్యం, బలాన్ని ఇవ్వాలని స్వామిని కోరుకున్నానని తెలిపారు. త్వరలోనే ఉగ్రవాద సమస్య పరిష్కరించేందుకు ప్రధానమంత్రి చర్యలు తీసుకుంటున్నారని కేంద్రమంత్రి వివరిస్తూ..

..వాయిస్.. 30 సెకన్లు

-------------------------

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి ఆర్టీసీ సిద్ధంగా ఉందని సంస్థ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు తెలిపారు. ఈ పథకం రాష్ట్ర వ్యాప్తంగా మహిళల జీవితాల్లో సానుకూల మార్పును తీసుకువస్తుందని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలందర్నీ ప్రధానంగా పేదలను కూడా అభివృద్ధిలో భాగస్వాములు చేయడానికి, సమాన అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఆర్టీసీ ఛైర్మన్ స్పష్టంచేశారు.

---------------------------

ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఈ రోజు తిరంగా ర్యాలీలు నిర్వహించారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో విద్యార్థులు, యువత, మాజీ సైనికులు వెయ్యి అడుగుల జాతీయ జెండాతో భారీ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి ప్రారంభించి, ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న ప్రతి సైనికుడికీ ధన్యవాదాలు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట ప్రభుత్వ కళాశాల మైదానం నుంచి తిరంగా యాత్ర ర్యాలీని శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌తో భారత్ దీటైన సమాధానం ఇవ్వగలదనే సందేశాన్ని ప్రపంచానికి తెలిజేశామన్నారు. నెల్లూరు నగరంలో రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ జరిగింది. మాగుంట సుబ్బరామిరెడ్డి సర్కిల్ నుంచి మొదలైన ర్యాలీ ఆర్టీసీ బస్టాండ్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఉగ్రవాదాన్ని నిర్మూలించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కృషి చేస్తున్నారని తెలిపారు.

---------------------------

అన్నమయ్య జిల్లా పీలేరు మండలం బాలమువారిపల్లి వద్ద కారు అదుపు తప్పి బావిలోకి దూసుకెళ్లడంతో ముగ్గురు మృతి చెందారు. మరో ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు. కర్ణాటక రాష్ట్రం చింతామణికి చెందిన ఐదుగురు వ్యక్తులు పీలేరు వెళ్తుండగా ఈ తెల్లవారుజామున వారు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న బావిలోకి దూసుకెళ్లింది. సమాచారం అందుకున్న పీలేరు పోలీసులు సహాయ చర్యలు చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

---------------------------

తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన ఆగస్టు నెల కోటాను తిరుమల తిరుపతి దేవస్థానం రేపు ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ నెల 22వ తేదీ ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ, శ్రీవారి సాలకట్ల పవిత్రోత్సవాల టికెట్లను విడుదల చేస్తారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటా విడుదలవుతుంది. ఈ నెల 24వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్ మనసులోని మాట” కార్యక్రమం 122వ సంచిక ఈనెల 25వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 117800 నెంబర్‌కు ఈనెల 23వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

అంతర్జాతీయ పురావస్తు ప్రదర్శనశాలల దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం. పురావస్తు ప్రదర్శనశాలలు దేశాల సాంస్కృతిక, వారసత్వ సంపదలను కాపాడి భావితరాలకు అపురూపమైన విజ్ఞానాన్ని

అందించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి. పురావస్తు ప్రదర్శన శాలలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు, వాటిని మరింత ప్రోత్సహించే ఆవశ్యకతను తెలియచేసేందుకు 1977 నుంచి ప్రతీఏటా మే 18వ తేదీన ప్రపంచ పురావస్తు ప్రదర్శనశాలల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

---------------------------

కాగా.. అంతర్జాతీయ పురావస్తు ప్రదర్శన శాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా ఉన్న అన్ని చారిత్రక ప్రదేశాలు, పురావస్తుశాలల్లో ఉచిత ప్రవేశం కల్పిస్తున్నామని భారత పురావస్తు సర్వే సంస్థ ప్రకటించింది. దేశ చరిత్రపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి, చరిత్ర గొప్పదనాన్ని తెలియజేయడానికి దేశవ్యాప్తంగా అత్యంత విలువైన పురావస్తు కళాఖండాలు ఉన్న 52 మ్యూజియాల్లో ఉచిత ప్రవేశం కల్పిస్తున్నామని అధికారులు పేర్కొన్నారు. తమ పరిధిలో ఉన్న 3 వేల 698 చారిత్రక ప్రదేశాల్లోనూ ఈ సౌకర్యం అందిస్తున్నామని తెలిపారు.

---------------------------

విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని వైద్య కళాశాలకు తరలించకుండా ప్రస్తుత ప్రాంతంలోనే కొనసాగించేందుకు అవకాశాలను పరిశీలించాలని ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. నగరం మధ్యలో ఉండడంతో అందుబాటులో ఉంటుందని, అనేక మంది ఇక్కడే కొనసాగించాలనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

కలెక్టర్ కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో మంత్రి నిన్న సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జీజీహెచ్ భవనాలను భవిష్యత్తు అవ సరాలకు తగ్గట్లు అభివృద్ధి చేయడానికి అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. ఖాళీగా ఉన్న సుమారు నాలుగెక రాల స్థలంలో పడకల సంఖ్య పెంపు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయవచ్చని.. 15 రోజుల్లో వివరాలు అందించాలని మంత్రి సూచించారు.

---------------------------

శ్రీశైలం జలాశయంలో ప్లంజ్ పూల్ పరిస్థితిని అంచనా వేసేందుకు కర్నూలు ట్రిపుల్ ఐటీ కళాశాల అధ్యాపకులు నిన్న పరిశీలించారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ డిపార్ట్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణానాయక్ ఆధ్వర్యంలో అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా కృష్ణానాయక్ మాట్లాడుతూ ప్లంజ్ పూల్ పరిస్థితిని అంచనా వేసేందుకు అండర్ వాటర్ డ్రోన్‌తో పరిశీలించామన్నారు. నీటి అడుగున లోతైన ప్రాంతాన్ని వీడియో తీశామని చెప్పారు. దెబ్బతిన్న భాగాలను స్పష్టంగా గుర్తిస్తే తగిన చర్యలు తీసుకొనేందుకు ప్రాజెక్టు అధికారులకు ఉపయుక్తంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎం.వెంకట్రావు ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్....23 సెకన్లు....

మరోవైపు.. అనంతపురం జిల్లా ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు మండలాల్లో ఈ రోజు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. విడపనకల్లు- ఆర్.కొట్టాల, పెంచులపాడు- పొలికి, ఉరవకొండ -ఉండబండ, పాల్తూరు - మల్లాపురం గ్రామాల మధ్య ఉన్న వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

=====================